అన్నట్లుగానే కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టింది. టెండర్ విధానం అనుసరించి లాటరీ పద్ధతిలో షాపులను కేటాయించారు. లక్కు ఉన్న వారు షాపులు చేజిక్కించుకున్నా.. ఆ లక్కును లాక్కోవడానికి కూటమి నేతలు యత్నిస్తున్నారు. ఏకంగా బెదిరింపులకు దిగి వాటా ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల లాటరీలో షాపు దక్కించుకొన్న వారిని సొమ్ము చెల్లించకుండా అడ్డుపడుతున్నారు. తమకు కమీషన్ ఇస్తేనే దుకాణం పెట్టనిస్తాం.. లేకుంటే పరిస్థితి మరోలా ఉంటుందని ఇబ్బంది పెడుతున్నట్లు సమాచారం. గత మూడు రోజులుగా కూటమి నేతలు చేస్తున్న ఈ దౌర్జన్యానికి వాపారస్తులు విస్తుపోతున్నారట.

వదిలేస్తారా! వాటా ఇస్తారా!!

- వాటా ఇచ్చి దుకాణం పెట్టుకోవాలని హుకుం
- పర్సెంటేజీ ఇవ్వకుంటే బెదిరింపులు
- విస్తుపోతున్న దుకాణ నిర్వాహకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: 'దుకాణం ఇస్తే మాకు ఇవ్వు లేదంటే 50శాతం వాటా తప్పని సరి.. కాదు కూడదు అంటే ఎలా మద్యం షాపు ఎలా నడిపిస్తావో మేమూ చూస్తాం" అంటూ జిల్లాలోని అనేక మద్యం షాపుల వద్ద అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు లాటరీ దక్కించుకున్న వ్యాపారస్తులను ఒత్తిడికి గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈనెల 14వ తేది మద్యం షాపుల లాటరీ నిర్వహించి లాటరీలో మొదటి వ్యక్తికి షాపును కేటాయించారు. మొదటి వ్యక్తి డిఫాల్టర్ అయితే రెండు, మూడు ఇలా మరో ఇద్దరిని లాటరీ ద్వారా ఎంపిక చేశారు. మొదటి వ్యక్తి కొత్త మద్యం పాలసీ ప్రకారం డిపాజిట్ చెల్లించక డీఫాల్టర్ అయితే రెండో వ్యక్తి అతనూ డీఫాల్టర్ అయితే మూడు వ్యక్తి మద్యం షాపు నిర్వహణ అప్పిగిస్తారు. ఈ నెల 16వ తేదీ నుంచి కొత్త మద్యం షాపులు తెరుచుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 104 మద్యం దుకాణాల కోసం తీవ్రస్థాయిలో పోటీ నడిచింది 2,240 దరఖాస్తులందాయి. అత్యధికంగా పాలసముద్రం మండలం దుకాణం కోసం దరఖాస్తులు వచ్చాయి.

లాటరీ ద్వారా దుకాణాలు దక్కించుకున్న వారు స్థానిక అధికార పార్టీ నేతల ఒత్తిళ్ళు ఎదుర్కొంటున్నారు. తమ ప్రాంతంలో దుకాణం పెట్టాలంటే మామూళ్ళు ఇచ్చుకోవాలందే అంటూ హుకుం జారీ చేస్తున్నారు. కూడదుకాదు అంటే ఎలా నడుపుతావో చూస్తామంటూ బెదిరింపులు తప్పడం లేదని వాపారస్తుల నుంచి అందిన సమాచారం. తీవ్ర పోటీ నడుమ రెండు లక్షల దరఖాస్తు రుసుము చెల్లించి మద్యం షాపులు దక్కించుకొని లక్షల రూపాయలు డిపాజిట్ రూపంలో చెల్లించినా ఒత్తిళ్ళు తప్పడం లేదు.

చిత్తూరుఅర్బన్ పరిధిలో 22 మద్యం దుకాణాలు మంజురు కాగా మద్యం దుకాణం నగర పరిధిలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు. గతంలో మద్యం షాపు పెట్టే ప్రాతం ఎక్సైజ్ అధికారులు నిర్ణయించేవారు. బడి, గుడికి వంద మీటర్ల దూరం తప్పని సరిగా ఉండేది. ప్రస్తుతం ఎక్కడైనా పెట్టుకొవచ్చనే వెసులుబాటులో బడి, గుడి అనే చూడకుండా పెట్టేస్తున్నారు. చిత్తూరు నగరంలో డిఐ రోడ్డు, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారంటూ మహిళలు రోడ్డెకారు.

పాలసముద్రం దుకాణికి ఓ ప్రత్యేకత

పాల సముద్రం మద్యం దుకాణాన్ని దక్కించుకొనే తీవ్రపోటీ నెలకొంది. 42 దరఖాస్తులు వచ్చాయి. లాటరీలో వాసు మద్యం దుఖాణం దక్కించున్నాడు. తమిళనాడు సరిహద్దు కావ డంతో ఈ మద్యం షాపుకోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులు కలసి నడుపుకుందాం.. అంటూ ఈనెల 14వ తేది లాటరీ ద్వారా మద్యం షాపు వాసుకు వచ్చిందని తెలిసిన వెంటనే ఎక్సైజ్ అధికారుల సమక్షంలో బేరసాలకు దిగారు. లక్షల రూపాయలు దరకాస్తు రూపంలో చెల్లించి నష్టపోయం మాకు న్యాయం జరిగాలి అంటూ ఒత్తిడి చేసి ఒప్పించిన్నట్లు సమాచారం. పాల సముద్రం మద్యం దుకాణం రోజుకు రెండు నుంచి మూడు లక్షల వరకు వ్యాపారం జరిగే అవకాశముంటున్నట్లు చెబుతున్నారు. ఐదేళ్ళలో 7 నుంచి 10కోట్లు సంపాదించే అవకాశమున్నట్లు పలువురు అంచానా వేస్తున్నారు.

మద్యం షాపులే.. చర్చ

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మద్యం షాపులపైనే చర్చ నడుస్తోంది. షాపుల ఏర్పాటు మద్యం అమ్మకాలు, బేరసారాలే కనిపిస్తున్నాయి. షాపులు దక్కించుకున్నవారు ఆనందం వ్యక్తం చేస్తుంటే దక్కనివారు సిండికేట్ కోసం చర్చలు నడుపుతున్నారు. ఇందు కోసం ఎమ్మెల్యేలను కూడా మద్యం షాపుల రొచ్చులోకి లాగి పార్టీ కోసం పని చేశాం.. వాటాలు ఇప్పిచండంటూ నేతల చుట్టూ తిరుగుతున్నారు. మరో వైపు మద్యం షాపులు దక్కించుకున్న ప్రతిపక్ష పార్టీకి చెందిన వారికి అధికార పార్టీ నుంచి బెదిరింపులు తప్పడం లేదట. స్థానిక అధికార పార్టీకి చెందిన వారికి అనుకూలంగా ఉంటూ వాటా ఇవ్వకుంటే షాపు ఎలా నడుపుతావో చూస్తాం.. యాదమరి మండలంలో ఈ పంచాయితీ మూడు రోజులుగా నడుస్తోందని తెలిసింది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. కొత్తగా మద్యం షాపులు దక్కించుకున్న వారికి షాపు నిర్వహణ కష్టాలు తప్పడం లేదనే చెప్పాలి.

'నిధులు విడుదల చేయండి'

తమిళనాడు కార్యదర్శిని కలిసిన అధికారులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: తమిళనాడు రాష్ట్రం నుంచి ద్రావిడ విశ్వవిద్యాలయానికి ప్రతి ఏటా రావలసిన నిధులను వెంటనే మంజూరు చేయాలని తమిళనాడు ప్రధాన కార్యదర్శి మురుగానందంను కోరినట్టు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య దొరస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం తమిళ విభాగంలోని ఉద్యోగులకు సంబంధించిన వేతనాలతో పాటు విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు అవసరమైన నిధులను ప్రతి ఏటా తమిళ ప్రభుత్వం విడుదల చేయడం జరిగేదన్నారు. ఈ నిధులు గత నాలుగు ఏళ్లుగా విశ్వవిద్యాలయానికి రావడం లేదని, కావున పరిస్థితులను పరిగణలోనికి తీసుకుని నిధులను వెంటనే మంజూరు చేయవలసిందిగా తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కోరడం జరిగిందన్నారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ఆయన త్వరితగతిన నిధులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. తమిళనాడు ప్రధాన కార్యదర్శిని కలవడానికి సహాయ సహకారాలు అందించిన ఆంధ్రరాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చల్లప్పకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తమిళ శాఖాధిపతి ఆచార్య విష్ణు కుమార్, ప్రజా సంబంధ అధికారి డాక్టర్ గణేష్ మూర్తి పాల్గొన్నారు.

ఊరగుట్టను యానాదులకు కేటాయించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఊరగుట్ట భూములను యానాదులకు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో మొగిలి భూములు సర్వే నివేదికను సిపిఎం నాయకులకు తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా వాడ గంగరాజు మాట్లాడుతూ బంగారుపాలెం మండలం మొగిలి రెవిన్యూలో ఊరగుట్ట భూముల సర్వే చేపట్టి దురాక్రమణలకు గురైన సమాచారాన్ని అందివ్వడం జరిగిందని, యానాదుల భూములను ఆక్రమణ దారుల నుంచి కాపాడాలని గత నెల సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు విన్నవించడం జరిగిందన్నారు. కలెక్టర్ వెంటనే స్పందిస్తూ డిప్యూటీ కలెక్టర్‌ను కేటాయించి క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయించారు. అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని కోరారు. ఆ భూములలో యానాదులకు పాఠశాలకు ఇతర సౌకర్యాలు కల్పించాలని, ఇళ్ల లేని యానాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. మండలంలో భూములు ఆక్రమించుకుంటున్నా అక్రమ దారులపై చర్యలు తీసుకోవాలని అక్రమ పట్టాలు పొందిన వారి పట్టాలను రద్దుచేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేదలకు ఇవ్వాలన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మురళి, సర్వేయర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అమలు చేయాల్సిందే..

- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ప్రసాదరావు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: దేశవ్యాప్తంగా ఉన్న దళిత ఉద్యోగుల సమస్యలను జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సత్వరం పరిష్కరిస్తుందని, వారికి అండగా నిలుస్తుందని కమిటీ సభ్యులు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ప్రభుత్వ సంస్థలు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని ఆయన సూచించారు. కేరళ రాష్ట్రంలోని మున్నార్, కొచ్చి వేదికగా గత మూడు రోజులుగా దళిత ఉద్యోగుల సమస్యలను పరిష్కారించేందుకు జాతీయ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు సమావేశాలను నిర్వహించారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ సభ్యుని హోదాలో ఈ సమావేశాలకు హాజరయ్యారు. ఆయనతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన 39మంది ఎంపీలు పాల్గొన్నారు. ఈ సమావేశాలకు జాతీయ సంస్థలైన ఎస్‌బీఐ, ఐఓసిఎల్, బిపిసిఎల్, ఓఎన్‌జిసి, సిఓఐఆర్, ఎంఎంటిసి, ఎన్ఎల్‌సి, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. భారత రాజ్యాంగానికి అనుగుణంగా వారు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించుకునేందుకు కావలసిన వాతావరణాన్ని ప్రభుత్వ సంస్థలు కల్పిస్తున్నాయా.. లేదా? అన్న అంశాలపై చర్చించారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రసాదరావు ఉద్యోగులతో ముఖాముఖి మాట్లాడారు.

స్పందించకుంటే సమ్మెకు దిగుతాం

- ఎన్‌టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిందే
- ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు లత డిమాండ్

ప్రజాశక్తి-గుడిపాల: ఎన్‌టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల సమస్యలకు పరిష్కరించకుంటే ఈ నెల 29 నుంచి సమ్మెకు దిగుతామని జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లత, జిల్లా కార్యదర్శి ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ జీవితాల్లో మార్పులు రావడం లేదని, వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకాన్ని ఇన్సురెన్స్ విధానంలోకి మార్పు చేస్తున్నారని అధికార వర్గాల్లోంచి సమాచారం రావడంతో 17ఏళ్ళుగా ఈ ఉద్యోగాన్ని నమ్ముకొని పనిచేస్తున్న జిల్లా మేనేజర్‌లు, టీం లీడర్లు, ఆఫీస్ అసోసియేట్స్, వైద్య మిత్రలు, యూనియన్ నాయకులు సమ్మె చేయడానికి పూనుకున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి న్యాయం జరగడం లేదని, సర్వీసును పరిగణనలోకి తీసుకొని సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తూ ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మరణించిన సిబ్బందికి రూ.15 లక్షల ఎక్స్రేషియా చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన, అవుతున్న సిబ్బందికి రూ.10లక్షల గ్రాట్యూటీ ఇవ్వాలని ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ నాయకులు ట్రస్ట్ సిఇఓకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం సకాలంలో స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 29 నుంచి సమ్మెకు దిగుతామని వారు తెలిపారు.

'ఆరోగ్య ప్రణాళికను పక్కాగా అమలు చేయాలి'

కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఆరోగ్య ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి అన్నారు. ఎంసిహెచ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జానకిరావు సంయుక్త ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ సమావేశం, జిల్లా ఆశా నోడల్ అధికారుల సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 100రోజుల్లో ఆరోగ్య ప్రణాళికను తయారు చేసుకుని ముందుకెళ్లాలన్నారు. ముఖ్యంగా మాత శిశు సంరక్షణ, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, శిశువుల అందించాల్సిన సేవలను పక్కా ప్రణాళిక ప్రకారం సేవలు అందించాలన్నారు. కిల్కారీ మొబైల్ యాప్‌ను ప్రతి గర్భిణీ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే శిశువులకు పూర్తి వ్యాధి నిరోధక టీకాలను 100శాతం పూర్తి చేయాలన్నారు. అసంక్రమణ వ్యాధులపై బిపి, షుగర్, క్యాన్సర్, గుండెవ్యాధులు, థైరాయిడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించి సేవలు అందించాలన్నారు. ఆశ కార్యకర్తలను ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ అన్ని రకాల సేవలను ప్రజలకు అందించేలాగా చూడాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ కిల్కారి ఆఫ్ నోడల్ అధికారి కీర్తి, జిల్లా ఆశానోడల్ అధికారి మూర్తి, పిహెచ్‌సీ ఆశ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

22న ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కార్వేటినగరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సిడాప్, డిఆర్డిఎ సంయుక్తంగా ఈ నెల 22వ తేది మంగళవారం స్థానిక కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ పి గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిగ్ సి జీతం 12 వేల నుండి 18వేలు వస్తుందని పేర్కొన్నారు. కనీస విద్యార్హత పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ పాస్ లేదా ఫైల్ అయినా విద్యార్థులు 18సంవత్సరాల నుంచి 35ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పురుషులు, మహిళలు హాజరు కావచ్చు అని తెలిపారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21 నుంచి ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు చెల్లింపులు

ప్రజాశక్తి-చిత్తూరు రూరల్: ఇంటర్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించడానికి ఇంటర్మీడియట్ విద్యా మండలి షెడ్యూల్ విడుదల చేసిందని చిత్తూరు జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి సయ్యద్ మౌలా తెలిపారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 21వ తేది నుంచి వచ్చే నెల అనగా నవంబర్ 11వ తేది వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు అని తెలిపారు. అలాగే రూ.1000 ఆలస్య రుసుంతో నవంబర్ 20లోగా చెల్లించవచ్చని, తరువాత చెల్లించడానికి అవకాశం లేదని తెలిపారు. అదే విధంగా ఇంటర్ పరీక్షలకు ప్రైవేట్‌గా రాసేవారు రూ.1500తో ఈ నెల 30లోగా, రూ.500 అపరాధ రుసుంతో నవంబర్ 30వ తేది వరకు చెల్లించవచ్చునని పేర్కొన్నారు.

సఫాయి కర్మచారిలకు కనీస వేతనాలు చెల్లించాలి

- కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్

సఫారీ కర్మచారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కమిటీ చైర్మన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సఫాయి కర్మచారిలకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వేతనాలు అందించాలని సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలుతో కలసి జిల్లాలో సఫాయి కర్మచారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్‌డివోలు, మున్సిపల్ కమిషనర్లతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సఫాయి కర్మచారి చైర్మన్ ఎం వెంకటేశన్ మాట్లాడుతూ.. కలెక్టర్, ఎస్‌పితో కలసి జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. కార్మికులకు ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా జీత భత్యాలు చెల్లించడం జరుగుతుందని ఇది శుభ పరిణామం అని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లాలోని మునిసిపాలిటీలకు సంబంధించిన పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సమీక్షలో భాగంగా చిత్తూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు జీతభత్యాలు చెల్లింపులలో వ్యత్యాసం ఉన్నదని, ప్రభుత్వ నిబంధనల మేరకు కనీస వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి స్కీంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, బ్యాంకుల ద్వారా రూ.2లక్షల వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రుణాలు అందించేలా లీడ్ బ్యాంక్ బ్యాంక్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేయలని జిల్లా యంత్రాంగానికి తెలిపామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో సఫాయి కర్మచారిలకు సంబంధించి అంశాలను చర్చించడం జరిగిందని తెలిపారు. ఈ సమీక్షలో భాగంగా పారిశుధ్య కార్మికులకు అందిస్తున్న ఆరోగ్య భద్రత, జీత భత్యాలు, పిఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం అంశాలను చర్చించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో గత నెలలో ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మీటింగ్ నిర్వహించడం జరిగిందని, వీటికి సంబంధించిన అంశాలను చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగిందన్నారు. ఈ సమీక్షలో చిత్తూరు జిల్లా ప్రధాన ఆస్పత్రిలో సఫాయి కర్మచారులుగా పనిచేస్తున్న నియమ నిబంధనల మేరకు వారికి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు అందించడం లేదని, ఆస్పత్రిలో సరైన వైద్య సేవలు అందివ్వడం లేదని, జూనియర్ డాక్టర్లు సేవలందించే విషయాన్ని సభ దృష్టికి తీసుకొని వచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం తరఫున అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జీత భత్యాలు అందుతున్న తీరును, కాంట్రాక్ట్ ఏజెన్సీల వివరాలను పరిశీలించారు. ఈఎస్‌ఐ ద్వారా అందుతున్న వైద్య సదుపాయాలు, పిఎఫ్ సౌకర్యాలను సక్రమంగా అమలు చేస్తున్నారా అని ఆరా తీశారు. జిల్లాలో ఈఎస్‌ఐ హాస్పిటల్ చేయాలని అప్ కాస్ ద్వారా మున్సిపాలిటీలలో విధులు నిర్వహిస్తున్న సఫాయి కర్మచారిలకు ఇంటి స్థలాలు కేటాయించాలని, ప్రతి నెలా రెగ్యులర్ జీతాలు అందజేయాలని యూనిఫారం, చెప్పులు అందించాలని ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ఈ కమిషన్‌కు సంబందించిన అంశాలను పలువురు చైర్మన్ దృష్టికి తీసుకుని రాగా కలెక్టర్ స్థాయిలో పరిష్కారం అయ్యే అంశాలను పరిశీలిస్తామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో జెసీ విద్యాధరి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి, డిఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతి దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎల్డీఎం హరీష్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, శ్రీనివాసులు, వెంకట్ రెడ్డి, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, సంఘ నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఒప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రాష్ట్రస్థాయి అండర్ 17 హాకీ పోటీలకు కాణిపాకం జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్ 17 విభాగంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు యువ శ్రీ, అండర్ 14 రాష్ట్రస్థాయి పోటీలకు దేవి ప్రియ, ఢిల్లీ బాబు, జాన్ ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల పీడీలు నాగరాజా, మహారాణిలతో పాటు కోచ్ రాఘవ కార్తీక్‌ను అభినందించారు.

ఎలివేటింగ్ రీసెర్చ్ ఎక్సలెన్స్‌పై అపోలో శిక్షణ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రెండు రోజులపాటు అపోలో విశ్వవిద్యాలయం "గ్రాంట్ గురుస్ ఎలివేటింగ్ రీసెర్చ ఎక్సలెన్స్" పేరుతో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులను డాక్టర్ తివారి ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డిఎస్‌టి టాస్క్‌ఫోర్స్ సభ్యులు మాట్లాడుతూ పోటీ గ్రాంట్ రైటింగ్, ఫండింగ్ మెకానిజమ్‌లపై దృష్టి సారించడం ద్వారా టిఏయులోని ఫ్యాకల్టీ సభ్యులు పండితుల పరిశోధన సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ సదస్సులో అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్ భట్ అధ్యక్షత వహిస్తూ ఫ్యాకల్టీకి పరిశోధనా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉధృతం.. గార్గేయ నది ప్రవాహం

పరిశీలిస్తున్న అధికారులు

శుక్రవారం ఉదయం నది వద్ద వరద ఉధృతి

- మూడు చోట్ల కొట్టుకుపోయిన కల్వర్టులు
- ఏడు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- పరిస్థితిని పరిశీలించిన జిల్లా, మండల స్థాయి అధికారులు
- పైపులతో తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణానికి నిర్ణయం
- మూడు రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్న అధికారులు

ప్రజాశక్తి-సోమల: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పెద్ద ఉప్పరపల్లి, అన్నెమ్మగారిపల్లి, పేటూరు పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో వాగు పొంగి ప్రవహించాయి. దీంతో గురువారం రాత్రి గార్గేయ నది ఉధృతంగా ప్రవహించింది. నదీ ప్రవాహానికి గ్రామాలకు అనుసంధానంగా నిర్మించిన తాత్కాలిక కల్వర్టులు కొట్టుకుపోయాయి. ఏడు గ్రామాలకు శుక్రవారం ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. బోన మంద, చిన్నకంపల్లి, రెడ్డివారిపల్లి, పొలిటిమాకులపల్లి, చింత తోపు, పేటూరు, బసవపల్లి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న జిల్లా ఉన్నతాధికారులు నది ప్రాంతాలను పరిశీలించారు. పీఆర్ ఎస్ఈ శంకర్ నారాయణ, ఈఈ నాగరాజు, చంద్రశేఖర రెడ్డి, కరుణాకర్, జేఈ ఆనంద్, ఎంపీడీవో నారాయణ, తహశీల్దార్ బెన్ను రాజ్‌లు అక్కడి పరిస్థితిని అంచనా వేశారు. గార్గేయ నది వరద ఉధృతి ప్రస్తుతం తక్కువగా ఉన్నందున మూడు రోజుల లోపు ఆరు లేక ఏడు లైన్లతో ఆర్‌సీసీ స్పిన్ పైప్స్ ఏర్పాటు చేసి తాత్కాలిక రోడ్డును నిర్మించడానికి చర్యలు చేపడతామని అధికారులు స్పష్టం చేశారు. ఇదివరకే ఓవర్ బ్రిడ్జి నిర్మించడానికి రెండు కోట్ల 38లక్షల రూపాయలతో నిధులు మంజూరై టెండర్ వరకు వచ్చి ఆగిందని, వర్షాలు ఆగిన తరువాత వచ్చే ఏడాది జనవరి లేక ఫిబ్రవరిలో శాశ్వత బ్రిడ్జి నిర్మించడం జరుగుతుందని ఎస్ఈ శంకరనారాయణ తెలిపారు. కాగా తాత్కాలిక కల్వర్టులు కొట్టుకుపోవడంతో ఏడు గ్రామాలకు చెందిన దాదాపు 500 నుంచి 600కుటుంబాల వారు నిత్యవసర సరుకుల కోసం విద్యార్థులు పాఠశాలలకు రావడానికి, ఆసుపత్రులకు రావడానికి శుక్రవారం నానా ఇబ్బంది పడ్డారు. బోనమంద పేటూరు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు కూడా వరద ఉధృతి దాటుకుని విధులకు హాజరయ్యారు. ఏది ఏమైనా పెద్ద ఉప్పరపల్లి ప్రాంతంలో ఎప్పుడు వర్షాలు అధికంగా కురవడం అటవీ సమీప ప్రాంతాలు ఎక్కువగా ఉండడం కారణంగా శాశ్వత ప్రాతిపదికన రోడ్ల నిర్మాణాలు, బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని డీఎం పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 130మంది విద్యార్థులకు డాక్టర్ సుమలత, హెచ్ఎం కేశవులు ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 6మంది విద్యార్థులకు లోపాలున్నట్లు గుర్తించామని కళ్ళ అద్దాలు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. పచ్చని ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు ఆహారంలో విరివిగా ఉపయోగించి కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీఎం పురం ఆశ వర్కర్స్ అశ్విని, లీల, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల రాజు పాల్గొన్నారు.

ఈ -పంటపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-గుడిపాల: ఈ -పంటపై రైతులకు అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారిని మాధవి అన్నారు. గుడిపాల మండలంలోని పాపసముద్రం రైతు సేవ కేంద్రంలో ఖరీఫ్ 2024, ఈ -పంట సామాజిక తనిఖీ గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగుచేసిన అన్ని పంటలను ఈ -పంట యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 344మంది రైతులకు ఈకేవైసీ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ పంట నమోదు డేటా ఆధారంగానే పంటలకు సున్నావడ్డీ పంట రుణాలు, పంటలకు బీమా, పంట నష్టపరిహారం, రైతులకు పెట్టుబడి సాయం అందుతుందన్నారు. సమావేశంలో సర్పంచ్ వల్లియమ్మ, విఎఎ తులసిరాం, రైతులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి ఎస్ఐగా పరశురాముడు



ఎస్ఐ పరశురాముడు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ఎస్ఐగా డి పరశురాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ కృష్ణయ్య విఆర్‌కి బదిలీపై వెళ్లారు. కాగా ఇక్కడ ఎస్ఐ పోస్ట్ గత రెండు నెలలుగా ఖాళీగా ఉంది. దీంతో ఎస్ఐ పరశురాముడిని ఇక్కడికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. మండలంలో శాంతిభద్రతల కాపాడటానికి కృషి చేస్తానని ఎస్ఐ తెలిపారు.

సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలి

- మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్

ప్రజాశక్తి-సదుం: సేంద్రీయ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ అన్నారు. శుక్రవారం బూరగ మంద, మొరవపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ, బుధవారాలలో నిర్వహించాల్సిన ఈ కార్యక్రమాన్ని తుపాను కారణంగా శుక్రవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేంద్రియ పద్ధతులపై శ్రీనివాసులు రెడ్డి, రాణి రైతులకు ప్రాక్టికల్‌గా వివరించారు. కార్యక్రమంలో సెరికల్చర్ అసిస్టెంట్ లలిత కుమారి, రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లి అంగన్వాడీ కార్యకర్తగా దివ్య

బాధ్యతలు చేపడుతున్న దివ్య

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి అంగన్వాడీ కార్యకర్తగా దాసరి దివ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అంగన్వాడీ టీచర్ వేదమణి మరణించడంతో ప్రభుత్వం నిర్వహించిన ఇంటర్వ్యూలో దివ్యని ఎంపిక చేసింది. కార్వేటినగరం సిడిపిఓ పద్మ సునంద సమక్షంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ డివి డిల్లెయ్య, అంగన్వాడి కార్యకర్తలు రాధమ్మ, కోమల, విజయ, భారతి, సతీష్, మురుగేష్ పాల్గొన్నారు.

15రోజులుగా దగ్గు ఉంటే గల్ల పరీక్షలు చేసుకోవాలి

- జిల్లా అదనపు ఆరోగ్య అధికారి వెంకట ప్రసాద్



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: 15 రోజులు పైగా దగ్గు ఉంటే వారు కచ్చితంగా గల్ల పరీక్షలు చేసుకోవాలని జిల్లా అదనపు వైద్యాధికారి వెంకట ప్రసాద్ అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించారు. అక్కడి వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరికన్నా 15 రోజులకు పై దగ్గు ఉంటే టీబీ ఉండే అవకాశం ఉందని అలాంటి వారు ప్రభుత్వ ఆసుపత్రిలో గల్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరు నెలల పాటు మందులు వాడితే వ్యాధి నివా రణ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వై ద్యులు శిరీష, ఆయేషా, జిల్లా కోఆర్డినేటర్ సం తోష్, టీబి సూపర్వైజర్ శివకుమార్, ప్రకాష్ ల్యా బ్ టెక్నీషియన్ భావన తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వినికిడి లోపం ఉన్న అభ్యర్థులు శుక్రవారం డిఈఐసి సెంటర్, ఈఎన్టి విభాగం, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మొత్తం 78 మంది,36 మంది పిల్లలు, 42 మంది పెద్దలు సద్వినియోగం చేసుకున్నారని చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి, ఆర్‌బిఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష తెలిపారు. ప్రభుత్వం వారు కల్పిస్తున్న ఈ ఉచిత చెవుడు, వినికిడి పరికరాలను సద్వినియోగం చేసుకున్న వారికి కృతజ్ఞతలు తెలుపుతూ డిఇఐసి నందు చెవుడు వినికిడి సమస్య ఉన్నవారు ఎప్పుడైనా వచ్చి చూపించుకోవచ్చునని తెలిపారు. ఆర్ఎంవో డాక్టర్ సంధ్య, డాక్టర్ రంగనాథ్, డాక్టర్ శిరీష, డాక్టర్ ప్రతాప్, రవితేజ పాల్గొన్నారు.

'మా గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయండి'

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎల్ఎస్ఓ

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం పేటూరు పంచాయతీ ఇర్లపల్లి గ్రామంలో చిన్నారుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. చిత్తూరు కలెక్టరేట్లో స్పందన కార్యక్రమంలో దరఖాస్తు చేయగా కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించారు. ఏఎల్ఎస్ఓ నర్సోత్తమ రెడ్డి శుక్రవారం గ్రామానికి వచ్చారు. గ్రామస్తులతో మాట్లాడి నివేదికలను సిద్ధం చేసుకుని వెళ్లారు. మండల విద్యాశాఖ అధికారులు శ్రీరాములు, శివరత్నమ్మ, జిల్లా అధికారులతో కలిసి ఇర్లపల్లికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. తమ గ్రామంలోని విద్యార్థులు పేటూరు పాఠశాలకు వెళ్లడానికి చాలా దూరంగా ఉందని తెలిపారు. తమ గ్రామంలోనే పాఠశాల ఏర్పాటు చేస్తే తమ పిల్లలను బడికి పంపుతామని వారు తెగేసి చెప్పారు. అంతేకాకుండా తమ గ్రామంలో 60మంది నివసిస్తున్నామని చాలామందికి ఆధార్ కార్డులు లేవని తమకు ఆధార్ కార్డులు కూడా తీసి ఇవ్వాలని అధికారులకు వారు తెలిపారు. గ్రామస్తులు చెప్పిన విధంగా నివేదికలను సిద్ధం చేసుకుని ఏఎల్ఎస్ఓ డిఈఓకు అందిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్పి సోమశేఖర్ పేటూరు ప్రధానోపాధ్యాయులు యాదవ్ పాల్గొన్నారు.

విద్యాశాఖ పనితీరుపై ప్రజాప్రతినిధులు ధ్వజం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డప్ప

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండల విద్యాశాఖ అధికారుల పని తీరుపై మండల ప్రజాప్రతినిధులు విమర్శించారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రెడ్డప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు మండల, పంచాయతీ స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని పలుశాఖల పనితీరుపై చర్చించిన అనంతరం విద్యాశాఖ అధికారులు, ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ కరువైందని వీరప్పల్లి ఎంపిటిసి సుబ్రహ్మణ్యం సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తుర్లపల్లి, నగిరేపల్లి గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక మూసివేత దిశగా ఉన్న మండల విద్యాశాఖ అధికారులు ఇద్దరు కనీసం పర్యవేక్షణ కూడా చేయకుండా ఏం చేస్తున్నారని ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం ఆరోపించారు. మండల విద్య శాఖ అధికారులు మాట్లాడుతూ అక్కడ పిల్లల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు ఆసక్తి చూపి వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేరిపిస్తున్నారని తెలపడంతో, మండల విద్యా శాఖ అధికారులు ప్రాథమిక పాఠశాల ఉన్న పరిసరాల గ్రామాల్లో పర్యటించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ఎందుకు కృషి చేయలేదని అదేవిధంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే అంగన్వాడీలలో పిల్లలను, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయవచ్చు కదా ప్రభుత్వ బడులు ఒకసారి మార్పు చేస్తే ఆ తర్వాత తరం పేద పిల్లలంతా చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు మీరు ఎందుకు కృషి చేయలేదని, మండలంలో డ్రాపోర్ట్స్ నియంత్రణ, పాఠశాలల పరిశీలన, జరగలేదని ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం సభ దృష్టికి తీసుకువచ్చారు. పెద్దారికుంట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠశాలకు సక్రమంగా విధులు హాజరు కాలేదని మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని స్థానిక సర్పంచ్ భాస్కర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 98 ఉండగా అందులో 74 ప్రాథమిక పాఠశాలలు, 10ప్రాథమికోన్నత పాఠశాలలు, 14 జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఉన్నాయి. మండల విద్యాధికారులు జిల్లా పరిషత్, ఉన్నత స్థాయి పాఠశాలలు మాత్రమే మధ్యాహ్నం భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్నారు కానీ ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తేనే ప్రాథమికోన్నత, ఉన్నత విద్యకు విద్యార్థులు హాజరవుతారన్న విషయాన్ని మండల స్థాయి విద్యా అధికారులు మరిచిపోయారని ప్రజా ప్రతినిధులు విమర్శించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలు బలహీన పడుతున్నాయని కొన్ని పంచాయితీలలో పాఠశాలలు మూసే పరిస్థితి నెలకొందని అందుకు కారణం మండల విద్యాశాఖ అధికారులు తీరునని ప్రజాప్రతినిధులు నిలదీశారు. దీంతో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందని ప్రశ్నించారు, అంతేగాక మధ్యాహ్నం భోజనం మరియు పాఠశాలలో మరుగుదొడ్లు త్రాగునీటి సౌకర్ ఇందుకు పూర్తి బాధ్యత విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపమేనని ఇలాగే కానీ ఉంటే మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో మూతబడి పోయే ప్రమాదం ఉందని ఇకనైనా తీరు మార్చుకుని పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని వారిని తీవ్రంగా హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో బాలాజీ మాట్లాడుతూ మండలంలో ఎస్టీ లు ఆధార్ కార్డులు లేనివారికి మరియు జనన ధ్రువీకరణ పత్రం లేని వారికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వారికి అవసరమైన పత్రాలు అందించాలని, ప్రతి శాఖ అధికారులు ప్రజా అవసరమైన సమస్యలను పరిష్కరించాలని అన్నారు ఈ సర్వసభ్య సమావేశానికి వైసీపీకి చెందిన 11 మంది ఎంపీటీసీలు గైర్హాజరు అవ్వడం గమనార్హం. కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, ఎంపీటీసీలు,సర్పంచులు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

- జిల్లా సిపిఎం నాయకులు మురళి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వర్షంలో తడిసి పాడైన వరి పంట నష్టపరిహారం చెల్లించాలని జిల్లా సిపిఎం నాయకులు మురళి అన్నారు. శుక్రవారం బంగారుపాలెం మండలం తగువారిపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామంలోని చంద్రశేఖర్, సుబ్రమణ్యం పండించిన వరి పైరు కోత దశలో వర్షాలకు నేలమట్టమైందని వర్షపు నీరు ఉండడం వల్ల గింజలన్నీ మొలకెత్తుతున్నాయన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట మొలకెత్తి పనికిరాకుండా పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాను దాటికి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఇదేవిధంగా మండలంలో నష్టపోయిన రైతులను నివేదికలు తయారుచేసి కలెక్టర్ పంపాలని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

నేడు మండల మీట్

ప్రజాశక్తి-సదుం: సదుం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో జి రాజశేఖర్ బాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు వి ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

సాగు భూములను సర్వే చేయించండి

- తహశీల్దార్‌ను కోరిన బాధితులు

ప్రజాశక్తి-చౌడేపల్లి: దశాబ్దాల తరబడి తమ సాగులో ఉన్న భూములను సర్వే చేయించి చూపించాలని పలువురు రైతులు తహశీల్దార్‌కు మొరపెట్టుకున్నారు. మండలంలోని పెద్ద కుండా మారి పంచాయతీ గోవిందరాజు చెరువు సమీపంలో పెద్ద కున్నమారికి చెందిన నాలుగు కుటుంబాల వారు దాదాపు 40ఏళ్ల నుంచి ప్రభుత్వం ఇచ్చిన 14ఎకరాలను సాగు చేసుకుంటున్నామని తమ కుటుంబాల్లో 70మంది అదే భూమిపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. అయితే తమ భూముల్లో కొందరు పట్టాలు చేయించుకుని అక్రమంగా చొరపాటు చర్యలు చేపడుతున్నారని లక్ష్మమ్మ, వెంకట లక్ష్మమ్మ, జ్యోతమ్మ, లక్ష్మమ్మలు తహశీల్దర్‌తో మొరపెట్టుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సంబంధిత భూములను సర్వే చేయించి ఇప్పించాలని తహశీల్దార్ హనుమంతు నాయక్‌కు వినతిపత్రం అందించారు. విచారణ చేసి న్యాయం చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీమంత్రి

ప్రజాశక్తి-విజయపురం(నగరి): వధూవరులను మాజీ మంత్రి ఆర్‌కే రోజా శుక్రవారం ఆశీర్వదించారు. కొత్తగా వివాహం చేసుకొని నగరి ఇంటి దగ్గరికి వచ్చిన వడమాలపేట మండలం ఎస్‌వి పురం పంచాయతీ గంధపు హరిజనవాడ గ్రామానికి చెందిన రవి కుమారుడు సిద్దు, నిర్మల వధూవరులను ఆహ్వానించారు. ఆనవాయితీగా వాళ్లకు విందు భోజ నాలు ఏర్పాటు చేశారు. పసుపు, కుంకుమ పట్టు వస్త్రాలు అందించి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-యాదమరి: సమాచార హక్కు చట్టం 2005పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యాదమరి మండల వ్యవసాయ అధికారి చరిత సమావేశం నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని 155 కమ్మపల్లి, తెల్ల రాళ్లపల్లి పంచాయతీ, పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎటువంటి సమాచారాన్ని ఏదైనా సరే ప్రజలు సమాచార హక్కు చట్టం 2005 ద్వారా పొందవచ్చని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని వారికి కావలసిన సమాచారాన్ని ఉచితంగా పొందవచ్చని తెలిపారు. సమాచార హక్కు చట్టం సామాన్య ప్రజలకు ఒక వజ్రాయుధం లాంటిదని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-పలమనేరు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పలమనేరు, బైరెడ్డిపల్లి, గంగవరం, వి కోట మండలాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు.

అభ్యాసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలి

- ఎంఈవో రమేష్ బాబు



బంగారుపాళ్యంలో



యాదమరిలో

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అభ్యాసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని ఎంఈవో -2 రమేష్ బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డైస్లెక్సియా దినోత్సవం సాహిత ఉపాధ్యాయులు హిమబిందు ఆధ్వర్యంలో జరిగింది. ప్రభుత్వ పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు భార్గవరావు, ఉపాధ్యాయులు మీరయ్య, కుమారి, నాగరాజ, గిరి తదితరులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: నిర్దిష్ట వైకల్యంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు టీచర్లుకు అవగాహన అవసరమని ఎంఈవోలు ఆంజినేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డిలు అన్నారు. గంగాధరనెల్లూరు హైస్కూల్లో నిర్దిష్ట వైకల్యంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్వో శ్రీనివాసులు, హెచ్ఎంలు హేమలత, రెడ్డమ్మ, సహిత విద్య టీచర్లు వరదారెడ్డి, పుష్పావతి, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాదమరి: డైస్లెక్సియాపై అవగాహన ర్యాలీ శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ప్రపంచ డైస్లెక్సియా వారోత్సవాల సందర్భంగా భవిత కేంద్రం విద్యార్థులు మండల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్స్ మధు, విష్ణు ప్రియ, ఉమా మహేష్, ఉపాధ్యాయులు హరికృష్ణ, రజాక్, జ్యోతిశ్వర్, శిల్ప పాల్గొన్నారు.

గుడిపాల: ప్రత్యేక శిక్షణతో అభ్యసన వైకల్యాలను అధిగమించవచ్చని గుడిపాల ఎంఈఓ 2 గణపతి అన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రం నుండి విద్యార్థులతో కలిసి శుక్రవారం డైస్లెక్సియా గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. నరహరిపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం ఖాతున్ బీ, ఉపాధ్యాయులు వాణి, భవిత, గురు ప్రసాద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చౌడేపల్లి: మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత సెంటర్ విద్యార్థులకు సంబంధించి నిర్దిష్ట అభ్యాస వైకల్యాలుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు కేశవ రెడ్డి, తిరుమలమ్మ ముఖ్యఅతిథిలుగా హాజరై ర్యాలీని ప్రారంభించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- కడా పిడి వికాస్ మరమత్

లబ్ధిదారులను కలిసిన కడా పిడి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కడా పిడి వికాస్ మరమత్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని గరిగచిన్నేపల్లి, నూలుకుంట, మల్లానూరు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల పరిధిలో గోకులం షెడ్డుల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడుతూ గోకులం షెడ్డులు ప్రభుత్వం అందించడంలో ఉన్న ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్ కుమార్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, డ్వామా వెంకట్రమణ, అనిమల్ హస్బండ్రీ ఏడి రెడ్డి కుమారి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

31 వరకు నట్టల నివారణ మందు పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ ఈనెల 18వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు పశు వైద్యాధికారిని చందన ప్రియ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నట్టల నివారణ మందు తాపించడం వల్ల గొర్రెలు, మేకలు వ్యాధి సోకకుండా జీవించే అవకాశం ఉందన్నారు. పెంపకదారులు పశువైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. మండలంలోని 35వేల గొర్రెలు, మేకలకు మందు తాపించే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పం: ప్రస్తుత వర్షా కాలంలో పశువులు, మేకలు, గొర్రెలు అనారోగ్యం బారిన పడకుండా ప్రభుత్వం పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు టీడిపి మండల అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి అన్నారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ కార్యమాన్ని శుక్రవారం బిరుగుండ్లపల్లీ గ్రామంలో ఆయన ప్రారంభించారు. మండలంలో 27వేల గొర్రెలు మేకలు ఉన్నాయని, మండలంలోని అన్నీ రైతు సేవా కేంద్రాల పరిధిలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా ప్రతి జీవానికి మందు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అధికారులు రవిశంకర్, చంద్రశేఖర్, స్వాతి, బాబు, స్థానిక టిడిపి నేతలు శివ, విజయకుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: ఆదికవి రామాయణ రచయిత వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను స్థానిక మండల పరిపాలన భవనం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అన్నదమ్ముల అనుబంధం తల్లిదండ్రుల బాధ్యతలు రాజ్యపాలన వంటి విషయాలను అందించిన మహాకవి వాల్మీకి మహర్షి అని టీడీపీ సీనియర్ బిసి నాయకులు ఆవుల రామచంద్రయ్య అన్నారు. కార్యక్రమంలో ఆదినారాయణ, గంగరాజు, మునుస్వామి, గురుమూర్తి, నరేష్, జగదీష్, మునిరత్న, శివ శంకర, గంగులప్ప రెడ్డి, నాగరత్నమ్మ, రెడ్డమ్మ, ముని, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారద ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ డాక్టర్ భీమ మోహన్, ఐక్యుఎసి డాక్టర్ వెంకటేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెసి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని కెసి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా ముగించినట్టు డాక్టర్ మంజునాథ్ తెలిపారు. సుమారు 54సంవత్సరాల వయసు గల వ్యక్తి గత ఐదు సంవత్సరాలుగా మోకాలి నొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రులలో చికిత్స పొందినట్టు తెలిపారు. అయినా సరైన ఫలితం లేకపోవడంతో రోగి కేసి ఆసుపత్రికి వచ్చినట్టు తెలిపారు. రోగి పరిస్థితిని గమనించిన వైద్యులు బెంగళూరు వంటి మహానగరాలలో మాత్రమే అందుబాటులో ఉన్న ఫారిన్ ఇంప్లాంట్ చికిత్సను అందించడం జరిగిందన్నారు. ఈ చికిత్సను కుప్పం పట్టణంలో మొట్టమొదటిసారిగా తమ ఆసుపత్రిలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు.

గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు సీజ్

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగిరి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం తిరుపతి ప్రాంతీయ నిఘా, అమలు అధికారి కరీముల్లా షరీఫ్ వారి ఆదేశాల మేరకు పోలీసు ఇన్స్పెక్టర్లు వెంకటరవి, చంద్రశేఖర్‌లు స్థానిక రెవెన్యూ అధికారులు మేఘవర్ణం, డిటి కేశవులు, విఆర్‌ఓలతో కలిసి విస్తృతంగా దాడులు చేపట్టారు. నగరిలోని తిరుత్తణి రోడ్డులో గల హనీఫా హోటల్, సుదర్శన్ స్వీట్స్, జబ్బర్ హోటల్, ఆర్ఆర్ హోటల్, మాషా అల్లా బిర్యాని సెంటర్, విరాట్ టీ స్టాల్‌లలో దాడులు చేపట్టారు. అక్రమంగా వినియోగిస్తున్న గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌లను సీజ్ చేసి యజమానులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

పాలసముద్రం పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పాలసముద్రం పోలీస్ స్టేషన్లో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్టేషన్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్ స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

బైక్ దొంగల అరెస్ట్

ప్రజాశక్తి-శాంతిపురం: అంతరాష్ట్ర బైక్ దొంగలను అరెస్ట్ చేసినట్లు సీఐ మల్లేశ్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండలంలోని అపోలో మెడికల్ షాప్ ఎదుట ఉంచిన హోండా డియో మోటార్ సైకిల్ దొంగతనం జరిగినట్లు వాహనదారుడుయ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కుప్పం ఎస్‌డిపి పార్థసారధి ఆదేశాల మేరకు రాళ్ళబూదుగూరు ఎస్ఐ నరేష్, గుడిపల్లి ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. కేసు దర్యాప్తు ప్రారంభించి శుక్రవారం మధ్యాహ్నం కుప్పం కేజిఎఫ్ రోడ్, రాళ్ళబూదుగూరు సమీపంలోని సాతు వద్ద రాళ్ళబూదుగూరు, గుడుపల్లి ఎస్సైలు సిబ్బందితో వాహన తనిఖీ చేపట్టారన్నారు. ముగ్గురు వ్యక్తులు మూడు ద్విచక్ర వాహనాలలో వస్తుండగా పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వారిని చాకచక్యంగా పట్టుకొన్నట్లు చెప్పారు. కదిరి ఓబనపల్లి చెందిన మధు, నవీన్ కుమార్, నందీష్‌లుగా గుర్తించామన్నారు. వారిని విచారించగా వారు చేసిన బైక్ దొంగతనాలను అంగీకరించారని తెలిపారు. వారి వద్ద నుంచి 12బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సుమారు రూ.12లక్షల విలువ ఉంటాయని వెల్లడించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. కేసు ఛేదించిన కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్, రాళ్ళబూదుగూరు ఎస్ఐ నరేశ్, గుడిపల్లి ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఆలయంలో చోరీ

- అమ్మవారి ఆభరణాలు, హుండీ డబ్బులు అపహరణ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు రూరల్ మండలంలోని మొసలి మడుగు గ్రామానికి ఆనుకుని రోడ్డుకు పక్కన నిర్మించిన మారెమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి దొంగలు చొరబడ్డారు. ఆలయ తలుపులను పగులగొట్టి అమ్మవారికి బంగారు ఆభరణాలు, హుండీ పగులగొట్టి అందులోని డబ్బులు సుమారు రూ.20వేలను దోచుకెళ్లారు. ఈ విషయాన్ని మరుసటి రోజున వెళ్లిన పూజారి విషయాన్ని గుర్తించి, గ్రామస్తులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చౌడేపల్లిలో..

మండలంలోని కాకిపేరు పంచాయతీ వడ్డివారిపల్లి వద్ద గల కదిరి నరసింహ స్వామి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తలుపులు హుండీని బదలగొట్టి భారీ స్థాయిలో నగదును దోచుకెళ్లారని గ్రామస్తులు తెలిపారు. నాలుగేళ్ల క్రితం స్వామి వారి ప్రాణ ప్రతిష్ట జరిగిందని అప్పటినుంచి హుండీ లేపుక్కింపు నిర్వహించలేదన్నారు. హుండీలో అత్యధికంగా భక్తులు నగదును కానుకలుగా వేశారని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుని వెళ్లారని వారు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

DOCUMENT LOST

I,GANAPATHI S/o Late A.Subbaih, residing at Siddampalli Village, K.Patnam Post, Thavanampalli Mandal, Chittoor District, AP do hereby inform that my joint family properties Partition Deed Original **Doc.No.2297/2019, Dated. 19.08.2019** has been lost by me while shifting the house and inspite of best effords I am unable to trace it and it is lost beyond recovery. Hence If any body found said document please handover to me at address or inform me to below mentioned mobile number.

Contact No. 9849220676